క్లుప్తంగా

ఘనంగా మహానటి సావిత్రి జయంతి



సావిత్రి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు, కవులు మాట్లాడుతూ మహానటి సావిత్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య, ప్రధాన కార్యదర్శి పి.హనుమంత రావు చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫి, సభ్యులు రోషన్ అలీ, అజయ్‌కుమార్, పుల్లయ్య, అరుణకుమారి, రమణాచారి, ముంతాజ్ బేగం, సంయక్‌కుమార్, శారద, రాఘవేంద్రాచారి, షేక్షావలి, పార్వతయ్య, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

కర్నూలు కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక మాధవనగర్‌లోని శివరామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి లక్ష కుంకు మార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వి.రాఘవయ్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం లక్ష కుంకుమార్చన నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రశేఖర శర్మ, సుబ్రహ్మణ్యం, శ్రీదేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాబ్రీ మసీదును కూల్చిన దోషులను శిక్షించాలి



ఆందోళన చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): బాబ్రీ మసీదును కూల్చిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జహంగీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఫాసిస్టు చర్యలను నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబ్రీ మసీదు కూల్చివేత లాంటి సంఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని మతాలు, కులాల ప్రజల మనోభావాలను ప్రభుత్వాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ ఉద్యమకారుడు జయన్న, విరసం బాధ్యుడు పినాకపాణి, ఎస్‌డీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్ పాల్గొన్నారు.

ఉలిందకొండ స్టేషన్ తనిఖీ

కల్లూరు: ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌ను కర్నూలు డీఎస్పీ కె.విజయశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఎస్‌ఐ గది, రిసెప్షన్, రైటర్, కంప్యూటర్ ఆపరేటర్, లాకప్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా గత మూడేళ్లలో స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశారు.

చీటింగ్ కేసు నమోదు

కర్నూలు(రాజ్‌విహార్): నగరానికి చెందిన మహమ్మద్ గౌస్ అనే వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఆటో నగర్‌లో జెడ్‌ఎస్ మోటర్స్ నిర్వాహకుడైన ఈయన ఇబ్రహీం అనే వ్యక్తికి స్థలం అమ్ముతానని అతని నుంచి రూ.56 లక్షలు తీసుకున్నాడు. తర్వాత స్థలం విక్రయించలేదు. దీంతో బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు మహమ్మద్ గౌస్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే గౌస్ ఐపీ పెట్టి పరారీలో ఉన్నట్లు వారు వెల్లడించారు.

వైద్య విద్యాబోధనపై వర్క్‌షాప్



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఎంబీబీఎస్ ఫైనలియర్ వైద్య విద్యార్థులకు ఎలా బోధించాలనే విషయమై కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో రెండురోజులుగా జరుగుతున్న కరిక్యులమ్ ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్ అనే వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ చలం టీచింగ్ ఎయిడ్స్‌ను అందించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఒకే వైద్యవిద్య ఉండే విధంగా ఫైనలియర్ విద్యార్థులకు ఎలాంటి బోధన చేయాలనే దానిపై రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ సింథియా, డాక్టర్ జయరామ్, డాక్టర్ రేణుకాదేవి టీచింగ్ మాడ్యుల్స్ ద్వారా వివరించారు. విద్యార్థులకు ఏ క్లాస్‌ను ఎలా బోధించాలనే విషయమై వారు సవివరంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కొండారెడ్డి, డాక్టర్ శారద, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ విజయశంకర్, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.



క్లస్టర్ వర్సిటీలో బాబాసాహెబ్‌కు నివాళి దృశ్యం



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో ...



ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో..



ఎస్సీ సంక్షేమ సంఘం, లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో..

మార్గదర్శకులు అంబేడ్కర్

- బాబాసాహెబ్ వర్ధంతి కార్యక్రమాల్లో వక్తలు
- నగరంలో రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకులు అని వక్తలు పేర్కొన్నారు. బాబాసాహెబ్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలు విద్యార్థి, ప్రజా, దళిత, ఉద్యోగ సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు.

➤ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం, ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్స్ ఫోరం ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్‌బాబు, ఫోరం అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది వై. జయరాజు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, ఎన్‌సీహెచ్ బజారన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాధికారం రావాలంటే అంబేడ్కర్ ఆశయాలకు అంకితమై పనిచేసే రాజకీయ పార్టీలకు ఓట్లు వేయాలని కోరారు.

➤సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి జేడీ రంగలక్ష్మీదేవి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు శివారెడ్డి, వీరప్రకాష్, మనోహర్ పాల్గొన్నారు.

➤ ఏపీ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ జీ నాగరాజు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు వై. నరసమ్మ, ఏఈ వీరయ్య, సిబ్బంది వెంగన్న, రఘు, మదనమోహన్, సురేంద్రకుమార్, అజాజ్ బాషా, మహేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

➤ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి తదితరులు పూల మాల వేసి నివాళి అర్పించారు.

➤నగరంలోని ఎల్‌బీజీ నగర్ రాయలసీమ మాదిగ దండోరా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి దండోరా వ్యవస్థాప అధ్యక్షులు అనంత రత్నం మాదిగ నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు పోస్టుమా స్టర్ ఎద్దుల డేవిడ్, నాయకులు రామక్రిష్ణ, శివ, శ్యా మూల్, ఏసు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో..

కర్నూలు (సిటీ/కల్చరల్): రాయలసీమ విశ్వవిద్యాలయంలో రాయలసీమ పరి రక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో నాయకులు బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు విజయ్, ఆంటోని, అశోక్, నిరంజన్, అరవింద్, విజయ్, ప్రేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

➤ ప్రభుత్వ జూనియర్ కాలేజీ(టౌన్ మోడల్)లో డీవీఈఓ జమీర్ బాషా, కేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప, టౌన్ కాలేజీ ప్రిన్సిపాల్ సుంకన్న, మిద్దూరు కాలేజీ ప్రిన్సిపాల్ శంకర్ నాయక్‌లు అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

➤ సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసులు, కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాదు రెడ్డి అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

➤ డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ జె.హేమంత్ బాబాసాహెచ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

➤మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ప్రిన్సిపాల్ జె.రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు అంబేడ్కర్ సేవలను స్మరించుకున్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్

కర్నూలు(సెంట్రల్/సిటీ/రాజ్‌విహార్): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అని కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జాన్ విల్సన్ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

➤ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పీటీ సాయి ప్రదీప్ కర్నూలు అర్బన్ పరిధిలోని స్టాంటన్‌పురంలో బాబాసాహెచ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మాలమహానాడు నాయకులు రాజశేఖర్, గ్రీటింగ్ వ్యవస్థాపకులు బి.శ్రీరాములు, ఎమార్పీఎస్ నాయకులు చంటి, రాజు, చంద్రుడు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

➤స్థానిక విద్యుత్ భవన్‌లో బాబాసాహెబ్‌కు విద్యుత్ అధికారులు, ఉద్యోగులు ఘన నివాళి అర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, ఈఈ ఓబులేసు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, రాష్ట్ర నాయకులు బెళగల్ ఉసేని, ఏడీఈ విజయభాస్కర్, జేఏ రాఘవ తదితరులు పాల్గొన్నారు.



శరీన్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల్పరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన స్ఫూర్తితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేల ప్రభుత్వంలో భాగస్వాములను చేశారన్నారు. స్థానిక, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 50 శాతం పదవులు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జయరాముడు, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహులు, శ్రీనివాసులు, శ్వేతారెడ్డి, నాయకులు నాగమద్దిలేటి, తిరుమలేష్‌గౌడ్, హుసేన్ ఆలం తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు

బాబాసాహెబ్ ఆశయ సాధనకు కృషి

కర్నూలు(రాజ్‌విహార్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభు త్వం కృషి చేస్తోందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య అన్నారు. బుధవారం బాబా సాహెబ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మహేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు శ్వేతరెడ్డి, జయరాముడు, సత్యం యాదవ్, శివ, సిరాజ్, గోపి, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ నదిని పరిరక్షించుకుందాం



చర్చాగోష్టిలో పాల్గొన్న వారితో ప్రముఖ భూగర్భ జలాల నిపుణులు ముచ్చకోట చంద్రశేఖర్

కర్నూలు సిటీ: తాగు, సాగు నీరు అందించే హంద్రీనదిని పరిరక్షించుకుందామ ప్రముఖ భూగర్భ జలాల నిపుణులు, విశ్రాంత ఉపసంచాలకులు ముచ్చకోట చంద్రశేఖర్ అన్నారు. హంద్రీనది దినోత్సవం సందర్భంగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి కిసాన్ ఘాట్‌లో హంద్రీనది పరిరక్షణపై సామాజిక వేత్త చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన మంగళ, బుధవారాల్లో చర్చాగోష్టి నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. హంద్రీలో ప్రవహించే నీరు ఒకప్పుడు చాలా తక్కువ లవణశాతం కలిగి ఉండేదన్నారు. కానీ నేడు నదిలో ఎక్కడ చూసినా మురుగునీరు చేరి అపరిశుభ్రంగా తయారు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సామాజికవేత్త చంద్రశేఖర్ కల్కూర, ఎకానమిస్ట్ ఆచార్య మన్సూర్ రెహ్మాన్ మాట్లాడుతూ కర్నూలు పట్టణం ఒకప్పుడు నదికి ఒక వైపు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం తుంగభద్ర, హంద్రీనదుల మధ్య నగరం విస్తరించిందన్నారు. దీని కారణంగానే నది దురాక్రమణలకు గురై తరుచూ నగరం వరదలకు కారణమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు నదుల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఓ నివేదికను సైతం అధికార యంత్రాంగానికి అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో హంద్రీనది పరిరక్షణ ఉద్యమకారులు రాజా గోపాల్ రెడ్డి, ఎస్.ఆర్.కె శర్మ, ముచ్చుకోట విజయకుమారి, ఎలమంచి రామయ్య, చరిత్రకారులు ఇమ్మానియేలు, సుధాకర్ గౌడ్, ప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎన్జీఓలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్

- ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు కేంద్ర మంత్రి రేణుక సింగ్ జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్న మూడు ఎన్జీఓలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులు సమకూర్చినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరూతా తెలిపారు. అనంతపురంలోని గ్రామ అభ్యుదయ సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్‌కు రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2020–21లో రూ.6,51,307, 2021–22లో రూ.19,14,030, 2022–23లో రూ.23,06,745, కృష్ణా జిల్లాలోని శ్రీలక్ష్మి మహిళ మండలికి నాన్–రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2020–21లో రూ.5,69,976, 2021–22లో రూ.37,13,750, 2022–23లో రూ.4,33,682, కర్నూలు జిల్లాలోని నవోదయ ఇంటిగ్రేషన్ కల్చరల్ సోషల్ ఎడ్యుకేషన్, వలంటరీ యాక్షన్‌కు రెసిడెన్షియల్ స్కూల్ నిమిత్తం 2022–23లో రూ.1,48,10,373 విడుదల చేసినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

వినియోగదారుల హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి

కర్నూలు (న్యూటౌన్): వినియోగదారుల హక్కులను కాపాడి మోసాలను అరికట్టాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డ్ అమెనిటీస్ సెక్రటరీలకు వివిధ అంశాలకు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూనికలు, కొలతలు ఉపయోగించే వ్యాపార సంస్థలు, ప్యాకేజ్ చేయబడిన వస్తువులను విక్రయించే వ్యాపార సంస్థలను ఎన్‌ఐసీ అభివృద్ధి చేస్తున్న యాప్ సహాయంతో నమోదు చేయాలని సూచించారు. ధ్రువీకరించని, ప్రామాణికం కాని తూనికలు, కొలతలు ఉపయోగించడం, ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా ప్యాకేజీలను విక్రయించడం వంటి విషయాలపై ఫిర్యాదులను స్వీకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో సమన్యాయం కోసం చలో ఢిల్లీ

- ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ



పోస్టర్లు విడుదల చేస్తున్న దండు వీరయ్య

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల భావితరాల కోసం రిజర్వేషన్లలో సమన్యాయం కోరుతూ ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ చెప్పారు. బుధవారం డా.బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని ఆయన విగ్రహం ఎదుట ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దండు వీరయ్య మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ నివేదిక ఆధారంగా చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ డిమాండ్ సాధనకు ఈ నెల 13, 14వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాదిగ కురుక్షేత్ర సంగ్రామ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో కమిటీ పేరుతో ఎస్సీ వర్గీకరణ కాలయాపన చేయడమే గాకుండా రెండు రాష్ట్రాల మాదిగల ఐక్యతను దెబ్బ తీసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి మాదిగలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు పెద్ద సంఖ్యలో కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆంజనేయమాదిగ, గోపి మాదిగ, రాజు, ప్రతాప్ మాదిగ, విహార్, సోల్మన్ తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

జమ్మూకాశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణకు మద్దతు

కర్నూలు(రాజ్‌విహార్): జమ్మూ కాశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ -2023 సవరణ బిల్లుకు వైఎస్‌ఆర్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ ప్రకటించారు. బుధవారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ జమ్మూ మరియు కాశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చాలా అవసరమన్నారు. ఆ రాష్ట్రంలో ఉన్న 83 అసెంబ్లీ సీట్ల ను 90కి పెంచాలని, ఇందులో ఎస్సీలకు ఏ డు, ఎస్టీలకు తొమ్మిది సీట్లు రిజర్వు చేయాలన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలని ర్యాలీ

కర్నూలు(లీగల్) : ప్రభుత్వం ఇటీవలే ప్రవేశపెట్టిన భూహక్కు చట్టం రద్దు కోరుతూ బుధవారం కర్నూలు న్యాయవాదులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు వారు తమ విధులు బహిష్కరించి రాజ్‌విహార్ వరకు ర్యాలీ నిర్వహించారు.అక్కడ మానవ హారం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, రవి, షాఫత్, వెంకటేశ్వర్లు, జాస్మిన్, హరినాథ్ చౌదరి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఖరీఫ్–2023లో పంటలు నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడానికి ముందుకు వస్తున్న ప్రభుత్వం రెండు హెక్టార్లకే పరిహారం ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. ఎకరాకు పరిహారం రూ.25 వేలకు పెంచాలన్నారు. మరోవైపు తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలను కరువుగా ప్రకటించాలని కోరారు.

వారిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్) : దళిత మహిళ మేఘన ఆత్మహత్యాయత్నానికి కారణమైన భర్త, అత్తామామలను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, అధ్యక్షురాలు అరుణ డిమాండ్ చేశారు. బుధవారం వారు సుందరయ్య భవన్‌లో మాట్లా డుతూ..కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన హరికృష్ణను మేఘన మూడు నెలల క్రితం పెళ్లి చేసుకుందన్నారు. అయితే,ఆస్తి కోసం భర్త, అత్త మామలు ఆమెను వేధింపులకు గురిచేయడంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్



17వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణ కార్యక్రమంలో నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): పేదల ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని 17వ వార్డు కార్పొరేటర్ కైప పద్మలతరెడ్డి అన్నారు. బుధవారం ఆ వార్డు పరిధిలోని 40వ సచివాలయంలో జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే పథకాలు దక్కేవన్నారు. జగన్ సీఎం అయిన తర్వాత అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్నారని, ఆయనను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర క్లస్టర్–2 అధ్యక్షుడు కేదార్ నాథ్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు చందు, నాగేంద్ర, సూర్యమోహన్, వసంతకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

- 5వ వార్డులో జరిగిన జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత పాల్గొని మాట్లాడారు. జెండావిష్కరణ చేసి, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేషు యాదవ్, ఎజాజ్, నబిసా పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రేపు జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 8 వ తేదీ స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం ప్రధాన కార్యదర్శి రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30 వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 93984 01721 సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

జాతీయ స్థాయి క్యారెమ్స్ పోటీలకు లిఖిత రెడ్డి ఎంపిక



లిఖిత రెడ్డి

కర్నూలు (టౌన్) : విశాఖపట్నంలో ఈనెల 10 వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు ఆంధ్ర రాష్ట్ర క్యారెమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్స్ క్యారెమ్స్ ఫెడరేషన్ కప్ పోటీలకు నంద్యాలకు చెందిన లిఖిత రెడ్డి ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఫెడరేషన్ కప్ పోటీలకు అర్హత సాధించిందని జిల్లా క్యారెమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. చెన్నకేశరరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫెన్సింగ్ పోటీల్లో సత్తా చాటాలి



ఫెన్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్) : ఈనెల 8 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్యాడెట్ అండ్ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికయిన క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ ఫెన్సింగ్ శిక్షకులు మహేశ్వరరావు, అసోసియేషన్ ప్రతినిధులు నీలమణికంత, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

కర్నూలు(అర్బన్): అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, జయ లలితమ్మ కోరారు. ఈ అంశంపై బుధవారం వారు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి నిరసన తెలిపారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ, రూ.18 వేల వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, భాగ్య,సువార్త, చౌడేశ్వరి, పార్వతి, సిఐటీయు జిల్లా అధ్యక్షులు పీఎస్ రాధాకృష్ణ, దుర్గారేణుక, శివమ్మ, మధుర, మానస, నీరజ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కార్మి, కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈనెల 8వ తేదీన అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక దీక్షకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.